క్లుప్తంగా

పూడికతీత పనులు



రామవరప్పాడు: రూరల్ మండలం ప్రసాదంపాడులో పారుదలకు నోచుకోని డ్రెయిన్లను గుర్తించి మంగళవారం పూడికతీత పనులు చేశారు. ప్రధాన గ్రామంతో పాటు పలు అంతర్గత రహదారుల్లో పారిశుద్ధ్య సిబ్బంది పూడికతీసి మురుగునీరు పారుదలకు చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని రామాలయం ప్రధాన వీధిలో, సాయిబాబా ఆలయం ఆర్చి నుంచి చివరి వీధి వరకు, పలు అంతర్గత రోడ్లలో పూడికతీత పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సర్నాల గంగారత్నం బాలాజీ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నట్లు తెలిపారు. కాల్వగట్టు ప్రాంతం, ప్రధాన గ్రామంలోని పలు అంతర్గత రోడ్లలో డ్రెయిన్లు పూడటంతో పూడికతీత పనులు చేసినట్లు పేర్కొన్నారు.

'యునైటెడ్ ముస్లిం' సంఘ అధ్యక్షుడు హాజీ ఇబ్రహీం మృతి



పెనమలూరు: యునైటెడ్ ముస్లిం హెల్పింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కానూరు సనత్‌నగర్‌వాసి ఎండీ హాజీ ఇబ్రహీం(హెడ్ల ఇబ్రహీం)(74) మంగళవారం తన స్వగృహంలో మృతి చెందారు. ఆయన ఆటోనగర్‌లో నైపుణ్యంతో లారీల హెడ్స్ మరమ్మతులు చేయటంలో దిట్ట. ఇబ్రహీం పేద ముస్లింలకు తన వంతు సేవ చేయడానికి యునైటెడ్ ముస్లిం హెల్పింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఆయనకు భార్య, ఐదుగురు సంతానం ఉన్నారు. యునైటెడ్ ముస్లిం అసోసియేషన్ సభ్యులు చాన్‌బాషా, రబ్బానీ, మున్వర్‌బేగ్, రియాజ్, జెంషేర్, రఫీ తదితరులు సంతాపం తెలిపారు.

చంద్రశేఖరుడికి ప్రత్యేక పూజలు



గన్నవరం రూరల్: పురుషోత్తపట్నంలో మంగళవారం పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలో గవ్యాంత పూజలు చేశారు. నీరాజనం మంత్ర పుష్పం సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముస్తాబాద ఎంఎస్పీ కమిటీ ఎన్నిక



గన్నవరం రూరల్: ముస్తాబాదలో మంగళవారం నియోజకవర్గ మహాజన సోషలిస్ట్ పార్టీ కన్వీనర్ మంద వేణుబాబు ఆధ్వర్యాన గోటూ విలేజ్ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎంఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ముస్తాబాద గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దువ్వూరి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పాల ప్రమోద్, ఉపాధ్యక్షుడిగా నందేటి రాజేష్, కార్యదర్శిగా ఉయ్యూరు విజయ్‌కుమార్, కోశాధికారిగా తోడేటి రమేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి యోగా ఉచిత శిక్షణ తరగతులు

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల ఎనిమిది నుంచి 21వ తేదీ వరకు యోగా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ యోగా కోచ్ సూర్యచంద్రకుమారి మంగళవారం తెలిపారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని యోగా హాలులో రోజూ ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు, సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 93988 76568, 93901 84906 సెల్ నంబర్లలో సంప్రదించి ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

దాసాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సుప్రసిద్ధ స్వయంభూ మాచవరం శ్రీ దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామికి ప్రీతికరమైన వడమాలను నైవేద్యంగా సమర్పించి సిందూరం, ఆకు పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, విద్యార్థులు స్వామిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.

తాగునీటి సమస్యకు చెక్

- జలజీవన్ మిషన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.16 కోట్లు మంజూరు
- ఆరు వాటర్ ట్యాంకుల నిర్మాణం
- ఉచితంగా ఆరు వేల కుళాయి కనెక్షన్లు
- రెండు గ్రామాల్లో పనులు ప్రారంభం



పెనమలూరులో నిర్మాణ దశలో వాటర్ ట్యాంక్

పెనమలూరు: మండలంలో తాగునీటి సమస్యకు చెక్ పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీని కోసం ప్రణాళిక రూపొందించారు. జలజీవన్ మిషన్ కింద రూ 16 కోట్ల నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేశాయి. ఈ ప్రాజెక్ట్ కింద ఆరు వాటర్ ట్యాంకుల నిర్మాణంతో పాటు పైప్‌లైన్లు ఏర్పాటుచేసి ఆరువేల కుళాయి కనెక్షన్లు ఉచితంగా ఇవ్వనున్నారు. పెనమలూరు మండలంలోని ఆరు గ్రామాల్లో జలజీవన్ మిషన్ ప్రాజెక్టు అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో అమలుచేస్తారు. ఒక్కో దశలో రూ.8 కోట్ల చొప్పున మొత్తం 16 కోట్లు నిధులు వెచ్చిస్తారు.

మొదటి దశలో ఇలా...

జలజీవన్ మిషన్ మొదటి దశలో రూ.8 కోట్లు వినియోగిస్తారు. ఇందులో భాగంగా వణుకూరు ఎస్సీ కాలనీలో రూ.38 లక్షలతో 90 వేల లీటర్ల వాటర్ ట్యాంకుతో పాటు పైప్‌లైన్ వేస్తారు. పెనమలూరులో రూ.32 లక్షల వ్యయ అంచనాతో 60 వేల లీటర్ల సామర్థ్యమున్న వాటర్ ట్యాంకు, పైప్‌లైన్ల నిర్మాణం జరుగుతుంది. ఈ రెండు వాటర్ ట్యాంకులు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి. వణుకూరు, గోసాల, పెనమలూరు, పెదపులిపాక, చోడవరం గ్రామాల్లోని దళితవాడల్లో పైప్‌లైన్ విస్తరణ పనులు కూడా చేపడుతున్నారు.

రెండవ దశలో ఇలా...

జలజీవన్ మిషన్ రెండో దశలో మరో రూ.8 కోట్ల నిధులు మంజూరు చేశారు. గంగూరు గ్రామంలో రెండు కాలువ కట్టలపై రెండు వ్యాటర్ ట్యాంకులు, ఏఆర్‌నగర్‌లో ఒకటి, ఎస్సీ కాలనీలో ఒకటి చొప్పున 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నాలుగు వాటర్ ట్యాంకులను రూ.80 లక్షల వ్యయ అంచనాతో నిర్మిస్తారు. నియోజకవర్గ కేంద్రం పెనమలూరులో రూ.50 లక్షల వ్యయ అంచనాతో 1.50 లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకు నిర్మించనున్నారు. గోసాలలో ప్రధాన గ్రామం, ఇస్లాంపేట, చోడవరం ప్రధాన గ్రామం, బీసీ కాలనీ, పెదపులిపాక ప్రధాన గ్రామంలో పైప్‌లైన్ల నిర్మాణం జరుగుతుంది. ఈ పనులు టెండర్ దశ ముగించుకుని సిద్ధంగా ఉన్నాయి.

ఉచితంగా కుళాయి కనెక్షన్లు

రెండు దశల పనుల తర్వాత ఆరు వేల కుళాయి కనెక్షన్లను ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది. దీనికి దాదాపు 20 కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు నిర్మించనున్నారు. ఎస్సీ, బీసీ కాలనీలతో పాటు ప్రధాన గ్రామాల్లో చాలా కాలం క్రితం వేసిన పైప్ లైన్ల స్థానంలో కొత్తగా లైన్లు వేసి నాణ్యమైన తాగునీరు సరఫరా చేస్తారు. మరో ఆరు నెలల్లో చేపట్టిన పనులు పూర్తికానున్నాయి.

సకాలంలో పనులు చేస్తాం

జలజీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తాము. వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం శరవేగంగా చేస్తున్నాం. గ్రామాలలో తాగునీరు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.

– నాంచారయ్య, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పెనమలూరు

బ్లడ్ డొనేషన్ క్యాంపులు విస్తృతంగా నిర్వహించాలి



బ్లడ్ బ్యాంక్ కౌన్సిలర్ల సదస్సులో డాక్టర్ సి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ రంగారావు తదితరులు

గన్నవరం రూరల్: రక్తదాన శిబిరాలను విస్తృతంగా నిర్వహించాలని చినఅవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యాన పాథాలజీ, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌ల పర్యవేక్షణలో రాష్ట్రంలోని 14 మెడికల్ కళాశాలల్లో పని చేస్తున్న బ్లడ్ బ్యాంక్ కౌన్సిలర్ల అవగాహన కార్యక్రమం ప్రారంభమైంది. డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో బ్లడ్ బ్యాంక్ కౌన్సిలర్ల పాత్ర ఎంతో ప్రాముఖ్యమైనదన్నారు. దాతల నుంచి రక్తాన్ని సేకరించేటప్పుడు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ప్రమాణాలు పాటించాలని చెప్పారు. డైలీ స్టాక్ రిపోర్టులు, రేర్ గ్రూపులు దాతలను ఫాలోఅప్ చేయాలన్నారు. 18 ఏళ్లు దాటిన వారు మూడు నెలలకొకసారి రక్తదానం చేయాలని యువతలో అవగాహన పెంచాలన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, పాథాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్ చంద్రరావు, ప్రొఫెసర్ కల్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రణీత్, జాస్మిన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ



బాపులపాడులో మలేరియా నిర్మూలనపై వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ర్యాలీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: దోమల నివారణ ద్వారా మలేరియా సోకకుండా ఆరికట్టవచ్చని బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డి.నారయ్య చెప్పారు. జాతీయ మలేరియా నిర్మూలన మాసోత్సవాల్లో భాగంగా హనుమాన్‌జంక్షన్‌లో మంగళవారం వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంజీ నగర్‌లోని పీహెచ్‌సీ నుంచి ప్రధాన రహదారుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ నారయ్య చెప్పారు. మలేరియా, అతిసార వ్యాధులకు పీహెచ్‌సీలో మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సీహెచ్‌వో ఎస్.ఫణి కుమార్, గన్నవరం సబ్ యూనిట్ ఆఫీసర్ ఆర్.వెంకటరాజు, ఎంపీహెచ్ఎస్ అప్పారావు, పలువురు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆసరా సొమ్ము ఇప్పించాలని వినతి



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న కోలవెన్ను గ్రామస్తులు

కంకిపాడు: వైఎస్సార్ ఆసరా సొమ్మును బ్యాంకర్లు తమ వ్యక్తి గత ఖాతాలకు జమ చేయటం లేదని కోలవెన్నుకు చెందిన పలువురు డ్వాక్రా మహిళలు తహసీల్దార్ టీవీ సతీష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సతీష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. బ్యాంకు అధికారులు ఆసరా సొమ్మును విడుదల చేయటం లేదని, డీఆర్డీఏ అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తహసీల్దార్ సతీష్ మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

- వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రముఖులు
- వైభవంగా సామూహిక కుంకుమార్చనలు, హోమాలు



వెంకన్న కల్యాణోత్సవం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం రాత్రి ఆలయ కళ్యాణ మండపంలో కనుల పండువగా జరిగింది. చిట్టినగర్‌లోని స్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూడో రోజైన మంగళవారం ప్రత్యేక హోమాలు, సామూహిక కుంకుమార్చనలు, స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో నిత్య హోమాలు, పంచసూక్త హోమం నిర్వహించారు. సాయంత్రం నిత్యం, బలిహరణాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు వినుకొండ రత్నమాచార్యులు, సహాయ అర్చకులు శ్రీనివాసులు, గోపినాథ్‌తో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం వేద పాఠశాల విద్యార్థులు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం కల్యాణ వేదిక వద్ద సామూహిక కుంకుమార్చనలు నిర్వహించగా, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

స్వామి వారి సేవలో ప్రముఖులు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వార్లను మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామి వారిని రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి. సిసోడియా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆయనకు దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

కమనీయం.. కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. కల్యాణ మండపం మేడపై ప్రత్యేకంగా వేసిన వేదికపై కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత ఎదుర్కోళ్ల ఉత్సవం నిర్వహించగా, అమ్మవార్ల, అయ్య వారి గుణగణాలను ఆలయ అర్చకులు చక్కటి వ్యాఖ్యానంతో భక్తులకు వివరించారు. అనంతరం మంగళ సూత్రధారణ జరిగింది. కల్యాణోత్సవంలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల ఏర్పాట్లను పాలక వర్గ సభ్యులు పొట్నూరి దుర్గాప్రసాద్, మజ్జి ఈశ్వరరావు, కామందుల నరసింహారావు, పిళ్లా విజయ్, పోతిన బేసు, మజ్జి శ్రీనివాసరావు, గూడెల రామకృష్ణ పర్యవేక్షించారు.

కౌలురైతు చట్టాన్ని సవరించండి

కౌలురైతు సంఘం

కంకిపాడు: కౌలురైతు చట్టాన్ని సవరించాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పి. రంగారావు కోరారు. కౌలురైతు సంఘ ప్రతినిధులు మంగళవారం తహసీల్దార్ టీవీ సతీష్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. రంగారావు మాట్లాడుతూ కౌలురైతుల చేతుల్లోనే వ్యవసాయం సాగుతుందన్నారు. కౌలురైతులకు దక్కాల్సిన ప్రయోజనాలను రైతులు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జె.రవి, వి.మరియదాసు, నాయకులు సీ శ్రీహరి, ఎస్.నాగేశ్వరరావు, తాడంకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలకు నోటీసు

పెనమలూరు: కానూరు అమరావతి కాలనీలో ఉన్న భాష్యం పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు లేదని, పాఠశాల యాజమాన్యానికి నోటీసు జారీ చేశామని, మండల విద్యా శాఖ అధికారి కనకమహాలక్ష్మి తెలిపారు. ఆమె మంగళవారం వివరాలు తెలుపుతూ కానూరు అమరావతి కాలనీలోని భాష్యం పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వ జీఓ 1కి విరుద్ధంగా ఏఈఈ, మెడికల్ ఫౌండేషన్, ఒలింపియాడ్ ప్రోగ్రాం అమలు చేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించటం చట్ట విరుద్ధమన్నారు. పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా అడ్మిషన్లు జరిపితే 24 గంటల్లో క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. అనుమతులు తీసుకునే వరకు పాఠశాలను మూసి వేయాలని ఆదేశించారు.

50 మంది రక్తదానం



ఉయ్యూరు: రక్తదానంతో ప్రాణదాతలు కావాలని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మచిలీపట్నం డివిజన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సచివాలయ, మెప్మా, మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు 50 మంది రక్తదానం చేశారు. కార్మికులకు రెడ్ క్రాస్ సొసైటీ కిట్లను అందించారు. కార్యక్రమంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ బాలాజీ, ప్రతినిధులు శంకర్ ఆనంద్, అనంతయ్య, రాంబాబు, కౌన్సిలర్లు గుంజా సుధాకర్‌బాబు, తెనాలి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

బాపులపాడు తహసీల్దార్‌గా సునీల్‌బాబు, ఆర్ఐగా ఉదయ్‌కుమార్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు తహసీల్దార్‌గా డి.సునీల్‌బాబు నియమితులయ్యారు. ప్రభుత్వం చేపట్టిన తాజా బదిలీల్లో ప్రస్తుతం మచిలీపట్నం తహసీల్దార్‌గా పని చేస్తున్న డి.సునీల్‌బాబు.. కొంతకాలంగా ఖాళీగా ఉన్న బాపులపాడు తహసీల్దార్ స్థానంలో వచ్చారు. బాపులపాడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజేష్‌కుమార్ గన్నవరానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గన్నవరం ఆర్ఐ టి.ఉదయ్‌కుమార్ బాపులపాడుకు నియమితులయ్యారు. తహసీల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్‌గా సీహెచ్ సాయి కృష్ణప్రసాద్ తోట్లవల్లూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

క్రమబద్ధీకరణపై కాంట్రాక్టు ఉద్యోగుల హర్షం

మొవ్వ: 2014వ సంవత్సరానికి ఐదు సంవత్సరాలు సర్వీసు ఉన్న కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన ప్రకటన పై మొవ్వ మండల పారామెడికల్ కాంట్రాక్టు సిబ్బంది మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. సుదీర్ఘ పాదయాత్రలో కాంట్రాక్టు ఉద్యోగుల బాధలు విన్న జగన్‌మోహన్‌రెడ్డి 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అంటూ ఇచ్చిన హామీని సఫలీకృతం చేయటం ఆనందదాయక మని పేర్కొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



కంకిపాడు గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



ఉయ్యూరు గ్రంథాలయంలో..

కంకిపాడు: గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ అన్నారు. వేసవి శిక్షణ తరగతులు కంకిపాడు శాఖా గ్రంథాలయంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం పుస్తక పఠనం, క్విజ్, ఆటల పోటీలు నిర్వహించారు. విజ్ఞానం, వికాసం గ్రంథాలయాలతోనే సాధ్యమని, గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ కోరారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్, గణితంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

ఉయ్యూరు: పట్టణంలోని ఏసీ గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం సంగీత ఉపాధ్యాయురాలు మాధవి సంగీతం, కథలు, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. రామదాసు కీర్తనలు, దేశ భక్తి గేయాలు నేర్పించారు. తరగతులను గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు. కాటూరు గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు.

గన్నవరం రూరల్: వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థుల్లో సృజనను వెల్లడి చేస్తున్నాయని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. మంగళవారం స్థానిక లైబ్రరీలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ ఆటలు నిర్వహించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి ఆధ్వర్యాన విద్యార్థులు ఖోఖో, లెమన్ అండ్ స్పూన్ ఆటల్లో పాల్గొన్నారు.



పురుషోత్తపట్నంలో మ్యూజికల్‌చైర్స్ ఆడుతున్న విద్యార్థులు

చండ్ర రాజేశ్వరరావుకు నివాళి



చండ్రకు నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు

గన్నవరం: స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం భూపోరాట యోధుడు చండ్ర రాజేశ్వరరావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్టీయూ రాష్ట్ర మాజీఅధ్యక్షులు పెద్దు వెంకటరత్నం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు కుటుంబంలో జన్మించిన చండ్ర సుదీర్ఘ కాలం సీపీఐ కార్యదర్శిగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారని గుర్తుచేశారు. అనేక భూపోరాటాలతో పేదలకు భూములు పంచిన ఘనత చండ్రకు దక్కుతుందన్నారు. నేతలు కాట్రగడ్డ రామచంద్రజోషి, కట్టవరపు విజయరావు, మోహన్‌రావు, విక్టర్, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య బోధించాలి

పెనమలూరు: ద్యార్థులకు ప్రయోగాత్మక విద్య బోధించాలని సమగ్ర శిక్ష ఏపీ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అటల్ టింకరింగ్ ల్యాబ్ హబ్‌లో 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరగనున్న వర్కుషాపును ప్రారంభించి ప్రసంగించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉన్న పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇంజినీరింగ్ స్టూడెంట్లతో వినూత్న బోధన కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, స్వీయ అనుభవ ప్రక్రియ వెలికి తీయటానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విద్యా నిపుణులు గణేష్ నిగం, మధుసూదన్, డాక్టర్ దేవకుమార్, భాగ్యశ్రీ, సుదర్శన్, స్వాతి, పాఠశాల హెచ్ఎం దుర్గాభవాని, ఎండీ జాకర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హరిత వన మహోత్సవం



మొక్కల సంరక్షణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్కిల్ అధికారులు

కురుమద్దాలి(పామర్రు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్ష మేరకు నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ చేపట్టిన జీ 20 జాన్ భాగిదరీ అనే కార్యక్రమంలో భాగంగా ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్ (హరిత వన మహోత్సవం)ను నిర్వహించామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండలంలోని కురుమద్దాలి స్కిల్ హబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు వివిధ అంశాలపై పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్ (హరిత వన మహోత్సవం) నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో ఏర్పాటు చేసిన ఏడు స్కిల్ హబ్‌లలో స్కిల్ కాలేజీలు, వివిధ విద్యా సంస్థల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ తెలిపారు. కురుమద్దాలి స్కిల్ హబ్‌లోని విద్యార్థులు ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించి విద్యార్థులతో మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించామని పేర్కొన్నారు. అంతే కాకుండా హబ్ ప్రాంగణంలో పలు మొక్కలను నాటించి, వాటి సంరక్షణ బాధ్యతలను విద్యార్థులకు అప్పగించామని తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయాలి

గుడివాడ టౌన్: విద్యార్థులు తమలో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు కృషి చేయాలని ఈఎస్‌సీ కో-ఆర్డినేటర్ నాగాంజనేయులు అన్నారు. నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జి–20 జన్‌భగీధరి కార్యక్రమంలో భాగంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయం ఆధ్వర్యంలో పట్టణంలోని ఏఎన్నార్ కళాశాల, కేటీఆర్ మహిళా కళాశాల, కేబీఆర్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగాంజనేయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ అనేక నైపుణ్యాలు దాగి ఉంటాయన్నారు. వాటిని వెలికి తీసి వ్యక్తిగతంగానూ సమాజానికి వారు ఉపయోగపడేలా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. విద్యార్థులు ఆ దిశగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కేటీఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ హరిధర్మేంద్ర, ట్రైనింగ్ ఆఫీసర్లు డి.ఆనంద్ వేణు, జీఎస్ నరసింహాచారి, పి.శేషుబాబు పాల్గొన్నారు.